క్లుప్తంగా

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



వైద్యులతో మాట్లాడుతున్న తహసీల్దార్

బజార్‌హత్నూర్: వేసవిలో జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ శ్యాంసుదర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, మెడికల్ ఆఫీసర్లు భీంరావ్, శిల్పాలతో మాట్లాడారు. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, ఉదయం 11 గంటలలోపు, సాయంత్రం 5 తరువాతనే బయట పనులు చేసుకోవాలన్నారు. వడదెబ్బ నివారణకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఐ నూర్‌సింగ్, ఎంసీ బాపురావ్, అశోక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు జొన్నల కొనుగోళ్లు నిలిపివేత

నేరడిగొండ: జొన్నల కొనుగోళ్లను ఈనెల 6,7 తేదీల్లో తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు నేరడిగొండ పీఏసీఎస్ సెంటర్ ఇన్‌చార్జి బారే నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. జొన్నల కొనుగోలు కేంద్రంలో నిల్వలు పేరుకుపోవడం, వాతావరణంలో వచ్చిన మార్పులతో కొనుగోళ్లను నిలిపివేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈనెల 8 నుంచి యాథావిధిగా కొనుగోళ్లు చేపట్టడం జరుగుతుందని, ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు.

బోథ్: బోథ్ మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోళ్లను మంగళ, బుధవారాల్లో నిలిపివేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి గోలి స్వామి తెలిపారు. కొనుగోలు కేంద్రంలో జొన్నలు అధిక మొత్తంలో నిల్వ ఉండటం వలన, వాతావరణం మార్పుల వలన కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

ఇచ్చోడ: మండలంలోని మాదపూర్, పట్వారిగూడ గ్రామాల్లో సోమవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్య సిబ్బంది మాట్లాడారు. మండల వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే 80 శాతం పూర్తయినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైన్స్ డిగ్రీ కళాశాలలో దోస్త్ హెల్ప్‌లైన్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల కావడంతో విద్యార్థుల సందేహాల నివృత్తి కోసం హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మే 3 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. 3 దశల్లో ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం హెల్ప్‌లైన్ సెంటర్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఏమైన ఇబ్బందులు ఉంటే 77021 57284, 97035 33626 సంప్రదించాలని కోరారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న సంతోశ్ రెడ్డి

తాంసి: అర్హులైన వికలాంగులకు, దళితులకు సైతం ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోశ్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పరమేశ్వర్, పోచ్చారెడ్డి, నర్సారెడ్డి, విలాస్, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

లింగాష్టక పారాయణం



పారాయణంలో పాల్గొన్న భక్తులు

బోథ్: సొనాల గ్రామంలోని శ్రీరాజరాజేశ్వర ఆలయంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న సామూహిక పారాయణ పదో వారానికి చేరుకుంది. ఉదయం 7.30లకు సామూహిక లింగాష్టక పారాయణం ప్రారంభించారు. మొత్తం 21 వారాలపాటు సామూహిక లింగాష్టక పారాయణం కొనసాగుతుందని భక్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

హార్వెస్టర్లకు డిమాండ్..



జొన్న పంట కోస్తున్న హార్వెస్టర్

- పెరిగిన కిరాయి
- ఎకరానికి రూ.4500 నుంచి రూ.5500 వసూలు
- జొన్న కోతకు కూలీల కొరత

తాంసి: యాసంగిలో జిల్లాలో సాగు చేసిన జొన్న కోతలు ప్రస్తుతం ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కూలీల కొరతతో రైతులు హార్వెస్టర్ యంత్రాలపై ఆధారపడుతున్నారు. అయితే అద్దె భారీగా పెరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది జొన్న పంట కోతకు ఎకరానికి హార్వెస్టర్ ద్వారా రూ.4 వేల చొప్పున తీసుకున్నారు. కానీ ప్రస్తుతం రూ.4500 నుంచి రూ.5500 వరకు పెంచారు. కంకిపై భాగం మాత్రమే కట్ చేసి నూర్పిడి చేస్తే రూ.3500 నుంచి రూ.4వేలు తీసుకుంటున్నారు.

రైతులపై ఆదనపు భారం..

గతేడాది కంటే దాదాపుగా రూ.1000కి పైగా యంత్రాల అద్దె పెంచడంతో రైతులపై ఆదనపు భారం పడుతుంది. అధిక మొత్తంలో రైతులు హార్వెస్టర్ ద్వారా జొన్న పంటలను కోయడంతో డిమాండ్ ఏర్పడింది. దిక్కులేని పరిస్థితుల్లో హార్వెస్టర్ యజమానులు చెప్పినంతా చెల్లించి, జొన్న పంట నూర్పిడి చేయించుకుంటున్నారు.

హార్వెస్టర్ల వైపు మొగ్గు..

జొన్న పంట ఒకేసారి కోతకు రావడంతో గ్రామాల్లో కూలీల కొరత నెలకొంది. కూలీల ద్వారా జొన్న కోత పనులు చేయిద్దామంటే సరిపడా కూలీలు దొరక్క రైతులు యంత్రాలపై ఆధారపడుతున్నారు. కోతకు వచ్చిన పంటను హార్వెస్టర్‌ల ద్వారా కోయడంతో త్వరగా పంట చేతికి వస్తుంది. పంట దిగుబడి పెరగడంతో హార్వెస్టర్లకు డిమాండ్ పెరిగింది.

రేట్లు పెంచుతున్నారు



జొన్న కోత కోసం దుకు ప్రతీ ఏటా హార్వెస్టర్‌ల నిర్వాహకులు రేట్లను పెంచుతున్నారు. స్థానికంగా కొందరు బయట నుంచి హార్వెస్టర్‌లను అద్దెకు తీసుకొచ్చి నడుపుతున్నారు. రేట్లను పెంచడంతో రైతులపై ఆర్థికభారం ఎక్కువ పడటంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది.

– బొంత సంతోష్‌రెడ్డి, రైతు

హార్వెస్టర్‌తో కోతలు



జొన్న కోసేందుకు కూలీల కొరత ఎక్కువగా ఉంది. వ్యవసాయ కూలీలు సరిపడా దొరక్క జొన్న పంట కోతలను హార్వెస్టర్ల ద్వారా చేపట్టాల్సి వస్తోంది. పెరుగుతున్న ధరలతో ఆర్థిక భారం అవుతుంది. అధికారులు ధరలను కట్టడిచేయాలి.

– హరీశ్‌రెడ్డి, రైతు

వామ్మో కరెంట్ బిల్లు

నేరడిగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం గృహజ్యోతి పేరిట విద్యుత్‌ను 200 యూనిట్ల వరకు ఉచితంగా ఇస్తుంది. ఇప్పటివరకు బిల్లులు రాకపోగా, ఇటీవల 18 రోజులకే మండల కేంద్రానికి చెందిన కమ్మరి వెంకట రమణకు రూ.6782 విద్యుత్ బిల్లు వచ్చింది. 18 రోజులకు 737 యూనిట్లు విద్యుత్ వినియోగించినట్లు చూపెడుతుందని బాధితుడు తెలిపాడు. ఇలా బిల్లు రావడం ఏమిటని ఆయన వాపోయాడు. అధికారులు స్పందించి ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని కోరుతున్నాడు.



బిల్లు చూపిస్తున్న బాధితుడు

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

తాంసి: విద్యుత్ స్తంభంపై నుంచి పడి ఈదుల్లా సావర్గాం గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు ప్రభాకర్ మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి సోమవారం కార్మికుల నుంచి సేకరించిన రూ.12 వేల నగదును సీఐటీయూ ఆర్థిక సాయం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ విధి నిర్వహణలో మృతి చెందిన దళిత కార్మికుడిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్ కుటుంబానికి రూ.50లక్షల పరిహారం చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆశన్న, అగ్గిమల్ల స్వామి, లింగాల చిన్నన, అశోక్, గంగన్న, సోనేరావు, వెంకట్రావు, కిరణ్, శంకర్ పాల్గొన్నారు.

పరామర్శ

బేల: మండలంలోని బాది గ్రామంలో గత నెలలో బీఆర్‌ఎస్ కార్యకర్త బొల్లి దయాకర్ ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురయ్యాడు. కాగా.. సోమవారం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు అధైర్య పడొద్దన్నారు. ఆయన వెంట ప్రమోద్‌రెడ్డి, బిక్కి ఆశన్న, పొచ్చరెడ్డి, తేజ్‌రావు ఉన్నారు.

దివ్య దేవరాజన్‌ను కలిసిన సుశీల

బోథ్: మండలంలోని బాబెర గ్రామానికి చెందిన స్వచ్ఛగ్రహీ అవార్డు గ్రహీత ఆత్రం సుశీల రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో దివ్య దేవరాజన్‌ను సోమవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తన కష్టాన్ని గుర్తించి ఆదివాసీలకు మరింత సేవ చేయడానికి సెర్ప్‌లో ఉద్యోగం కల్పించేలా చూడాలని దివ్య దేవరాజన్‌ను కోరారు.

సమావేశాన్ని విజయవంతం చేయండి

ఇచ్చోడ: ఇచ్చోడ మండల కేంద్రంలో ఈనెల 7న నిర్వహించే బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ సమీక్ష స మావేశాన్ని విజయవంతం చేయాలని ఆదిలాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు సోయం బాపురావు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ జిల్లా అబ్జర్వర్ తాహెర్‌బిన్ హందాన్, సత్యనారాయణ రానున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి



విద్యార్థిని అభినందిస్తున్న డీఐఈవో గణేష్ జాదవ్

ఆదిలాబాద్‌టౌన్: కష్టపడి చదివి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న స్నేహ ఇంటర్‌లో 470కి గాను 467 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 2వ స్థానంలో నిలిచింది. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో విద్యార్థిని అభినందించారు. ఐఐటీ, జేఈఈ వంటి ఉన్నత చదువులకు అయ్యే ఖర్చు తానే భరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు డీఐఈవో గణేష్ జాదవ్ తెలిపారు.

సదస్సు విజయవంతం చేయండి

నార్నూర్: గాదిగూడ మండల కేంద్రంలో ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8న నిర్వహించే ఎడ్యుకేషన్ అవగాహన సదస్సును విజయవంతం చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూరు సంతోష్ అన్నారు. సోమవారం గాదిగూడ మండల కేంద్రంలో మాట్లాడారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను సన్మానించడంతో పాటు ఉన్నత చదువులపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. సమావేశంలో నాయకులు మరప గంగారాం, కోరేంగ సంబు, కనక ప్రభాకర్, కొడప లింగు, సోనేరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్వోగా బాధ్యతలు స్వీకరణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ రెవెన్యూ అధికారిగా బి.కళ్యాణ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయనకు ఆర్వోగా పదో న్నతి కల్పిస్తూ ప్రభుత్వం గత మార్చి 14న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇందిర మ్మ ఇళ్ల సర్వే, ఆస్తి పన్ను వసూలు ఇన్‌చార్జీ ఆర్వో ఆధ్వర్యంలోనే సాగాయి. ప్రస్తుతం ఆ పనులు పూర్తి కావడంతో కమిషనర్ రాజు ఆదేశాల మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆర్ఐలు, ఆ విభాగం ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

దినసరి ఉద్యోగుల వేతనాలు పెంపు

కైలాస్‌నగర్: ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఎన్ఎంఆర్, డెలివైజ్ కార్మికులకు 2025–26 సంవత్సరానికి గాను రోజువారి వేతనాలను పెంచుతూ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉమ్మడి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేబిసి నారాయణ, ఎస్.శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ప్రాంతంలో రూ.502, నాన్ మున్సిపాలిటీలో రూ. 539, ఏజెన్సీలో రూ. 692 చొప్పున వేతనాలు పెంచడం జరిగిందన్నారు.

రేపు కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం

కైలాస్‌నగర్: కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని ఈనెల 7న ఆదిలాబాద్ పట్టణంలోని తరంగిణి ఏసీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు జరిగే సమావేశానికి పీసీసీ పరిశీలకులు ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్, చిట్ల సత్యనారాయణ హాజరుకానున్నట్లుగా పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆదిలాబాద్‌టౌన్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు సోమవారం డీఈవో శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల చేయాలన్నారు. నాగమణి, పుష్పలత, శ్రీదేవి, రాంబాయి, శశికళ, సత్యమ్మ, సుమంత, లక్ష్మీ పాల్గొన్నారు.

సన్మానం

బోథ్: సొనాల మండల పరిధిలో గల అతి పురాతనమైన శ్రీ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్ సోమ గంగారెడ్డి, వైస్ చైర్మన్ రామాయి రాముతో పాటు కమిటీ సభ్యలను జాతీయ బౌద్ధ మహాసభ సంఘం సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. సంఘం అధ్యక్షుడు అమృత్ రావు పాటిల్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మునేశ్వర్ సోమన్న, పాముల సంతోష్, పంచాక్షరి, చిన్నయ్య, రవి, గంగాధర్, నరేష్, గోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా కారల్ మార్క్స్ జయంతి

ఆదిలాబాద్‌టౌన్: సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం కారల్ మార్క్స్ జయంతిని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, నాయకులు షేక్ పాషా, గణేష్, ప్రహ్లాద్, పరమేశ్వర్, గంగమ్మ పాల్గొన్నారు.

దేశ సేవ చేసే అవకాశం రావడం అదృష్టం

నేరడిగొండ: దేశ సేవ చేసే అవకాశం లభించడం అదృష్టమని మాజీ సర్పంచ్ పద్మ నగేశ్, బోథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తీత్రే నారాయసింగ్‌లు అన్నారు. కొర్టికల్(కె) గ్రామపంచాయతీ పరిధిలోని ధన్నూర్(డి)కి చెందిన సాబ్లే రాము–సాబు బాయి కుమారుడు సాబ్లే శ్రావణ్ కుమార్ ఆర్మీ ఉద్యోగానికి ఎంపిక కావడంపై సోమవారం వారి నివాసంలో శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న శ్యామలాదేవి

కైలాస్‌నగర్: ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణీకి వచ్చే అర్జీదారులకు మజ్జిగ అందించేందుకు ఆదిలాబాద్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్స్ అసోసియేషన్ ముందుకొచ్చింది. ఈ కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి సోమవారం ప్రారంభించారు. పలువురికి స్వయంగా మజ్జిగను అందజేశారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దినేష్ మాటోలియా, కందుల రవీందర్, కోశాధికారి మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణ ప్రతీఒక్కరి బాధ్యత



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ: టీబీ నివారణ ప్రతీఒక్కరి బాధ్యత అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో డీటీసీవో డాక్టర్ సుమలత, ఎస్‌టీఎస్‌లు దేవిదాస్, సుధ, హెచ్ఈవో పవార్ రవీందర్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీబీ నివారణ అవగాహన పోస్టర్ ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నిక్షయ్ శివిర్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండడమే ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. హైరిస్క్ ఉన్న వారందరికీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు.



కిట్లు అందజేస్తున్న డీటీసీవో సుమత

'నిక్షయ్ శివిర్'తో టీబీకి చెక్

నేరడిగొండ: టీబీ మహమ్మారికి చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 'నిక్షయ్ శివిర్' కార్యక్రమాన్ని చేపడుతుందని డీటీసీవో సుమత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిక్షయ్ శివిర్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళికలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. టీబీ రోగులను గుర్తించి వారికి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సద్దాం, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు సమ్మర్ క్యాంప్ సద్వినియోగం చేసుకోవాలి



సమ్మర్ క్యాంప్ ప్రారంభిస్తున్న సీఐ

ఇచ్చోడ: పోలీసు సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై పురుషోత్తం అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ పా ఠశాలలో ఇచ్చోడ, బోథ్, సిరికొండ మండల పరిధిలో ఉన్న విద్యార్థుల కోసం సమ్మర్ క్యాంప్ ప్రారంభించారు. ఈ క్యాంప్ ఈనెల 5 నుంచి జూన్ 5 వరకు. ఉదయం 7 గంటల నుంచి 8.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలి పారు. ముందుగా ఎంపిక చేసిన పీఈటీలతో విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రొబేషనరీ ఎస్సై సంజ యకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై పురుషోత్తం

ఇంద్రవెల్లి: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని జి ల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మ ర్ క్యాంప్ హాజరయ్యారు. ప్రతీ రోజు ఉద యం, సాయంత్రం క్యాంప్‌కు హాజరై, పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై సాయన్న, సిబ్బంది పాల్గొన్నారు.

నార్నూర్: క్రీడలతో మానసిక దృఢత్వం లభిస్తుందని నార్నూర్ సీఐ రహీం పాషా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఏకలవ్య కళాశాలలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్‌క్యాంప్ ప్రారంభించారు. సమ్మర్ క్యాంపు ద్వారా అన్ని రంగాలలో సరైన శిక్షణను అందించడం జరుగుతుందన్నారు. యోగా, కరాటే, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బాస్కెట్ బాల్, పీఈటీతో పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల (బోథ్) విద్యార్థులు సోమవారం అ'పూర్వ' సమ్మేళనం నిర్వహించారు. 2002– 2006 బ్యాచ్ విద్యార్థులు జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. అందరూ ఒకేచోట చేరి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. సెల్ఫీలు దిగుతూ.. ఉల్లాసంగా గడిపారు. గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు రమేశ్‌రెడ్డి, నాగరాజు, భాగ్యలక్ష్మి, సంతోష్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక చార్జీలు వసూలు చేయొద్దు

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలో చేపడుతున్న జొన్నల కొనుగోళ్లలో హమాలీలు రైతుల వద్ద నుంచి అధిక చార్జీలు వసూలు చేయవద్దని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ అన్నారు. సోమవారం యార్డులో హమాలీలు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని పొచ్చెర గ్రామానికి చెందిన రైతు రమణ మార్కెట్ చైర్మన్, కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. అయితే తాము అధికంగా చార్జీలు తీసుకోవడం లేదని హమాలీలు పేర్కొన్నారు. దీంతో కొంతసేపు కొనుగోళ్లు ఆగిపోయాయి. ప్రభుత్వం నిర్ణయించిన చార్జీలు మాత్రమే తీసుకోవాలని కార్యదర్శి పేర్కొన్నారు.



మాట్లాడుతున్న గంగారెడ్డి

కన్నాపూర్‌ను సందర్శించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

సిరికొండ: 'కన్నాపూర్‌లో నీటి కష్టాలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించా రు. సోమవారం అధికారులు కన్నాపూర్ గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులు శ్రమదానంతో బాగు చేసుకున్న బావిని పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ.. గ్రామంలో నీటి కష్టాలు లేకుండా చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీఓ ఫణీందర్ అన్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో రవీందర్, ఎంపీవో సంతోష్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



బావిని పరిశీలిస్తున్న అధికారులు